క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న దృశ్యం

కోసిగి: కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాల్లోని 21 గ్రామాల్లో నివాసం ఉంటున్న అనాథలు, వృద్ధులు, వికలాంగుల నిరుపేదల కుటుంబాలకు ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ఆర్డీటీ ఏరియా లీడర్ కృష్ణయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో 108 మందికి 6 నెలలకు సరిపడ సరుకులు ఉచితంగా అందజేశారు. సంస్థ క్లస్టర్ కోఆర్డినేటర్లు మారుతి రావు, లక్ష్మీనారాయణ, బసవరాజు, ఇంజినీర్లు చిన్న, వీరేష్ పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

ఆలూరు రూరల్: అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి సూచించారు. బుధవారం ఆయన ఆలూరులోని సచివాలయం–3 పరిధిలో ఫ్యామిలీ ఫిజిషయన్‌లో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచిచల్లార్చిన నీటి తాగాలన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నట్లు చెప్పారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

తుగ్గలి: గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర సమస్యలపై దృష్టి సారించాలని, పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని పత్తికొండ డివిజనల్ లెవెల్ అధికారి ప్రకాష్‌నాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలపై ఆరా తీసిన ఆయన పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు.


మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళ మార్ట్ వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

గోనెగండ్ల: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేందుకు వైఎస్సార్ చేయూత మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. బుధవారం తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్‌తో కలిసి మండల కేంద్రం గోనెగండ్లలో మహిళ మార్ట్ ఏర్పాటు చేసేందుకు భవనాలను పరిశీలించారు. గోనెగండ్ల సహకారం సంఘం గోడౌన్, షాపులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పొదుపు మహిళలందరూ కలిసికట్టుగా జీవనోపాధి పొందుటకు మండలానికి ఒక వైఎస్సార్ చేయూత మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ మేరకు ప్రతి మండలంలో మహిళ మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మార్ట్ ఏర్పాటుకు కావలసిన మౌలిక వసతులు తదితర వాటిని గురించి మహిళలకు వివరించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో మాట్లాడారు. శ్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



దుకాణాల నుంచి సేకరించిన పత్తి విత్తనాలను చూపుతున్న ఏఓ రాజు

కోసిగి: రైతులు విత్తనాలు కొనుగోలులో జాగ్రత్తలు తీసుకుని నకిలీ విత్తనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రాజు సూచించారు. బుధవారం మండలంలోని 36 విత్తన దుకాణాలను తనిఖీ చేసి 16 కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు నమూనాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్ టెస్టింగ్‌కు పంపుతామని చెప్పారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా నకిలీ అని తేలితే కంపెనీ, షాపు యజమానిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. కొన్న విత్తనాలకు తప్పకుండా బిల్లు తీసుకుని జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. లూజు విత్తనాలను కొనరాదన్నారు. ఖరీఫ్‌లో మండలంలో 80శాతం పొలాల్లో దాదాపు 25వేల ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశముందని చెప్పారు. 10 శాతం వేరుశనగ, మిగిలిన 10శాతం వరి , మిరప, ఉల్లి పంటలు సాగు చేయనున్నారని వివరించారు.

పాడి రైతులకు ధీమా

- వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం స్థానంలో 'వైఎస్సార్ పశు బీమా' అమలు
- పాడి పశువులతో పాటు మగ పశువులకూ బీమా
- రేషన్ కార్డు ఉన్నవారు 20 శాతం, మిగిలిన వారు 50 శాతం ప్రీమియం చెల్లించాలి
- ఈనెల 1 నుంచి దరఖాస్తుకు అవకాశం



ఎద్దులను పశువుల ఆసుపత్రికి తీసుకొచ్చిన రైతులు

ఆదోని సెంట్రల్: విపత్తులు కరవు కాటకాలు, రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, విద్యుదాఘాతాలతో ఏటా వేలాది మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పశువులను కన్నబిడ్డల్లా చూసుకొనే యజమానుల బాధలు వెలకట్టలేనివి. తమ కుటుంబ పోషణకు తోడుగా ఉన్న జీవాలు ప్రాణం కోల్పోతే తల్లడిల్లిపోతారు. అలాగే వారికి ఉపాధి కూడా దూరమవుతుంది. ఈ నేపథ్యంలో వివిధ ఘటనల్లో మూగజీవాలు కోల్పోతున్న వారిని ఆదుకోవాడానికి ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా వారికి అండగా నిలవనుంది.

గతానికి భిన్నంగా..

గతంలోనున్న వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం స్థానంలో వైఎస్సార్ పశు బీమా (లైవ్ స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్) పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా పాడి రైతులు,గొర్రెలు, మేకలు, పందుల పెంపకం దారులకు ఊరట కలుగుతుంది.

పాడి రైతులకు మంచి అవకాశం



పాడి రైతులకు ఇది మంచి అవకాశం. గతంలో పాడి గేదెలకు మాత్రమే బీమా ఉండేది. ఇప్పుడు అన్ని పశువులకు అవకాశం కల్పిస్తున్నారు. గత ఏడాది పశు నష్టం జరిగిన రైతులకు వైఎస్సార్ పశుబీమా కింద పరిహారం అందిస్తున్నాం. ఈనెల 1వ తేదీ నుంచి పశుబీమా పథకానికి దరఖాస్తు చేసుకొనేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. మరిన్ని వివరాలకు సమీపంలోని రైతుభరోసా కేంద్రం లేదా పశు వైద్యాధికారులను సంప్రదించాలి. – **పి.వి.రమణ, పశువైద్యశాఖ ఉపసంచాలకులు**

గత బీమా విధానంలో కేవలం ఉత్పాదక పశు పోషకులకే బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. సన్నకారు రైతులు, పట్టణాల్లో ఒంటిద్దు బండ్లతో జీవనం సాగించే కర్షకులకు ఎద్దులే జీవనాధారం. మొదటిసారి మగ పశువులనూ (ఎద్దులు, దున్నపోతులు) ఈ జాబితాలో చేర్చారు.

బీమా మొత్తం	లబ్ధిదారుని వాటా బీపీఎల్/ఎస్సీ/ఎస్టీ,	ఏపీఎల్	వ్యవధి (సంవత్సరాలు)
రూ.30వేలు	రూ.384	రూ.960	3
రూ.15వేలు	రూ.192	రూ.480	3
గొర్రె లేదా మేకలకు			
రూ.6వేలు	రూ.36	రూ.90	1
రూ.6వేలు	రూ.54	రూ.135	2
రూ.6వేలు	రూ.75	రూ.187.5	3

అర్హతలు..

నూతన పథకంలో ఎస్సీ/ఎస్టీ/దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు ప్రీమియం మొత్తంలో 20 శాతం, మిగతా వర్గాలు 50 శాతం చెల్లించాలని నిర్ణయించారు. మిగతాది ప్రభుత్వమే భరించి ప్రయోజనం చేకూర్చనుంది. పథకంలో ఒక కుటుంబానికి గరిష్ఠంగా 5 గేదెలకు, 50 గొర్రెలు/ మేకలు/ పందులకు పశుబీమా చేసుకోచ్చు.

- గొర్రెలు, మేకలు 6 నెలలు వయస్సు ఉండాలి. ఎద్దులు దున్నపోతులు పనిచేసేవిగా ఉండాలి.
- విదేశీ జాతికి ఏడాదిన్నర నుంచి పదేళ్లు. దేశీయ జాతివైతే రెండేళ్ల నుంచి పదేళ్ల వయస్సు వరకు బీమా చెయించుకోవచ్చు.

చిత్రలేఖనంపై అవగాహన

ఆదోని అర్బన్: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం 31వ రోజున రిటైర్డ్ హెచ్ఎం ప్రసాద్ పిల్లలకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. దేశనాయకుల చిత్రాలు, వారికి ఇష్టమైన చిత్రాలు గీయడంలో పోటీలు నిర్వహించారు.

నేడు వైస్ ఎంపీపీ -1 ఎన్నిక

పెద్దకడబూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు– 1 ఎంపిక ఉంటుందని ఎంపీడీఓ ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరమేష్‌గౌడ్ ఇటీవల గుండెనొప్పితో మృతి చెందిన విషయం తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నిక చేపట్టినట్లు చెప్పారు. మండలంలోని మిగిలిన ఎంపీటీసీ సభ్యులు ఎన్నికకు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

బాలిక అదృశ్యం

మంత్రాలయం: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బాలిక ఏరువాక పౌర్ణమి వేడుకలకు సుంకేశ్వరి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అయితే అక్కడ కనిపించకుండా పోవడంతో తల్లిదండ్రులు మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ సేవలను విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

కౌతాళం: సచివాలయ సేవలను విస్తృతం చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను వేగంగా పరిష్కరించాలని తెలిపారు. సచివాలయ వ్యవస్థకు దేశంలో మంచి పేరు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం వీటి ద్వారా మరిన్ని సేవల్ని అందుబాటులోకి తేవడానికి సిద్ధంగా ఉందన్నారు. కొందరు సిబ్బంది చిన్న చిన్న సాకులు చెప్పి పనులు చేయకుండా తిప్పుకోవడం సమంజసం కాదన్నారు.హౌసింగ్ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ గోపీనాథ్‌రెడ్డి, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యకు ఎంపిక



ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులతో ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య

కోసిగి: కోసిగి ఏరియా పరిధిలో పదవ తరగతిలో ఉత్తమ మార్కులతో సాధించి ఆర్డీటీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన ఏడుగురు విద్యార్థులు ఉన్నత ఉచిత విద్యకు ఎంపికయ్యారని ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఎంపికై న విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందించి సలహాలు, సూచనలు చేశారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విజయవాడ, తిరుపతి, కర్నూలులోని కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదువుకోవచ్చునన్నారు. ఇంటర్ నుంచి ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో రాణించేంత వరకు ఉచితంగా కళాశాల ఫీజుతో పాటు నోటు పుస్తకాలు, యూనిఫామ్స్, దుస్తులు, మెస్ బిల్లు, సెలవుల్లో ఇంటికి వచ్చేందుకు రవాణా ఛార్జీలు, మెడికల్ బిల్లులను ఆర్డీటీ ముందుగానే మంజూరు చేస్తుందని చెప్పారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



మేకడోణలో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మేకడోణ గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లాగా కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్నీ గ్రామంలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో రాయితీ విత్తనాలు కావాలన్నా, లేదా ఎరువులు కావాలన్నా మండల కేంద్రంలో పడిగాపులు కాయాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఏఓ ఎం.వరప్రసాద్ మాట్లాడుతూ మండలానికి 320 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. కావాల్సిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. కో–ఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్‌పటేల్, నాయకులు నాగేంద్ర, మల్లేష్, రాజకుమార్, మాదవరెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్య వెంట రాలేదని భర్త ఆత్మహత్యాయత్నం

- మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలింపు
- కోసిగిలో ఘటన



ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్యాధికారి మనోజ్‌కుమార్

కోసిగి: మండలంలోని చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన కామన్‌దొడ్డి చిన్న హనుమంతు అనే వ్యక్తి బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు భార్య ఉరుకుందమ్మ పుట్టినిల్లు అయిన కోసిగికి ఏరువాక పండుగకు వచ్చింది. పండుగ ముగిసింది కదా సొంత ఊరికి వెళ్దామని పిలిచాడు. గర్భిణి కదా.. మరో రెండు రోజులు ఉండి వస్తుందని ఆమె తల్లిదండ్రులు చెప్పారు. తాను పిలిచినా రావా అంటూ కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి కొండ ప్రాంతం వైపు పురుగు మందు తీసుకెళ్లి తాగి.. తాను చనిపోతున్నానని చిన్నభూంపల్లిలోని చిన్నాన్న కుమారుడికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అప్రమత్తమైన యన వెంటనే కోసిగికి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న హనుమంతును స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ డాక్టర్ మనోజ్ కుమార్ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేశారు.

స్ట్రెచ్చర్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

- ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఘటన
- కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లే క్రమంలో ప్రమాదం



పురుషుల వార్డులో రిపేరీ పేరుతో బాత్‌రూమ్‌కు తాళం వేసిన దృశ్యం

ఆదోని టౌన్: మరుగుదొడ్డికి వెళ్తుండగా చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ఆదోని ఏరియా ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన అబ్దుల్‌రజాక్ కాళ్లు ఇన్ఫెక్షన్ కావడంతో పది రోజులుగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఉదయం భార్య మున్ని స్ట్రెక్చర్‌పై కింది వార్డులోని మరుగుదొడ్డికి తీసుకెళ్లింది. ర్యాంపు మీదుగా వస్తున్న సమయంలో స్ట్రెక్చర్‌ను బ్యాలెన్స్ చేయలేకపోవడంతో అబ్దుల్‌రజాక్ కింద పడ్డాడు. పక్కనే ఉన్న రోగులు పైకి లేపుతుండగా ఉలుకూపలుకు లేకుండా ఉండిపోయాడు. వార్డులోని సిస్టర్లు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇదిలాఉంటే ఆసుపత్రిలోని ఒకటవ అంతస్తు పురుషుల వార్డులో నాలుగు మరుగుదొడ్లు, ఒక బాత్‌రూం.. మహిళల వార్డులో రెండు మరుగుదొడ్లు, ఒక బాత్‌రూం గత 20 రోజులుగా రిపేరీలో ఉన్నాయి. వీటికి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌లు ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న, సంబంధిత కాంట్రాక్టర్‌కు పలుమార్లు సూచించారు. గత నెలలో జిల్లా కలెక్టర్ సృజన ఆకస్మిక తనిఖీలోనే ఇదే విషయమై హెచ్చరికలు చేశారు. అయితే ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని మృతుని బంధువులు వాపోయారు.

పల్లెల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- రచ్చమర్రిలో రెండు వర్గాల మధ్య విభేదాలు
- గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు
- విచారణ డీఎస్పీగా శివనారయణస్వామి
- ఎమ్మిగనూరు డీఎస్పీ నేతృత్వంలో శాంతి కమిటీ ఏర్పాటు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీలు

మంత్రాలయం: మండలంలోని రచ్చమర్రి గ్రామంలో ఏరువాక పండగ రోజు పరుగు పందెం విషయంలో తలెత్తిన వివాదం తారాస్థాయికి చేరుకుంది. గ్రామంలోని ఇరు వర్గాల మధ్య గొడవ జరగడంతో చెదరగొట్టి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే గ్రామ సమీపంలోని ఓ వర్గం పంట పొలాల్లో నుంచి పై భాగంలో ఉన్న మరో వర్గం పంట పొలాలకు వెళ్లకుండా, మరియు మహిళలు బహిర్భూమికి వెళ్లడానికి వీలేద్దంటూ ముళ్లకంపలు అడ్డుగా వేయడంతో గ్రామంలోని రెండు వర్గాలుగా విడిపోయాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతవరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మాధవరం ఎస్ఐ కిరణ్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఆదోని, ఎమ్మిగనూరు డీఎస్పీలు శివనారయణస్వామి, సీతారామయ్య, సీఐ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని ఇరు వర్గీయులకు కౌన్సెలింగ్ నిర్వహించి శాంతి కమిటీ ఏర్పాటు చేశారు. గతంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ అధికారిగా ఆదోని డీఎస్పీ శివనారయణస్వామి గ్రామంలో పర్యటించి గొడవకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్పెషల్ పార్టీ, స్థానిక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

రచ్చమర్రి గ్రామంలో చిన్న విషయానికి తలెత్తిన వివాదం ఇరువర్గాల మధ్య గొడవకు కారణమైంది. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. అనవసరంగా గొడవలకు పాల్పడి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా నడుచుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

– సీతారామయ్య, ఎమ్మిగనూరు డీఎస్పీ

ఎండ తీవ్రతను భరించలేక..



ఎరిగేరి గ్రామంలోని నీటి కుంటలో చిన్నారుల తుళ్లింత

కౌతాళం: విపరీతమైన ఉక్కుపోత కారణంగా ప్రజలు ఉపశమనం పొందేందుకు వివిధ రకాల మార్గాలు అవలంభిస్తున్నారు. కొందరు పిల్లలు గ్రామాల్లో తమకు అందుబాటులో నున్న కుంటలు, చెరువులు, బావులు, కాలువల్లో ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు. మండలంలోని ఎరిగేరి గ్రామ శివారులో ఉరుకుంద ఆర్చ్ గేట్ వద్ద పశువుల దాహం తీర్చేందుకు, ప్రజల అవసరాలను తీర్చుకునేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో బోరు వేసి నీటి కుంట ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం ఎండ తీవ్రతను తట్టుకోలేక చిన్నారులు ఇలా సేద తీరారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. రుద్ర మని బుదువారం తెలిపారు. ఓపీఎస్ బదులు జీపీఎస్ అమలు చేయడం ద్వారా పదవీ విరమణ నాటికి మూల వేతనంలో 50 శాతం పెన్షన్, దానిపై డియర్‌నెస్ రిలీఫ్ ఇస్తామని చెబుతునప్పటికీ పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు భద్రత నివ్వదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు.

పిల్లలను పనిలో ఉంచుకోవద్దు

మంత్రాలయం : 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో ఉంచుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పలు లాడ్జీలు, హోటల్, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో చెత్త సేకరించే చిన్నారులను గుర్తించి అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ అధికారి శారద, ఐసీపీఎస్ నాగేశ్వరరావు, ఎన్‌సీఎల్‌పీ రంగారెడ్డి ఉన్నారు.

తోటల సాగుకు రైతులను గుర్తించండి

ఆదోని రూరల్ : ఐదు ఎకరాల్లోపు రైతులను గుర్తించి పండ్లతోట సాగుచేసేలా చూడాలని ఏపీడీ లోకేష్ సూచించారు బుధవారం స్త్రీశక్తి భవనంలో ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి లక్ష్యాలు నిర్దేశించారు. పనులు కావాలని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించి, గరిష్ఠ వేతనం అందేలా పనులు చూపాలని చెప్పారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆటో కార్మికులకు పట్టాలివ్వాలి

ఆదోని రూరల్ : పట్టణంలోని ఆటో నగర్ ఆటో కార్మికులకు పట్టాలు అందజేయాలని సీఐటీయూ సీనియర్ నాయకులు మహానందరెడ్డి, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ కొత్త బస్టాండు ఆటో కార్మికులకు యూనియన్ గుర్తింపు కార్డులను అందజేశారని, ఆటో నగర్ ఏర్పాటు చేస్తామని గతంలో డబ్బులు కట్టించుకున్న వారికి కొత్త ఆటోనగర్‌లో పట్టాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త బస్టాండు ఆటో యూనియన్ నాయకులు మహేష్, రాము పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

కోసిగి: మండలంలోని జగనన్న లేఅవుట్స్, సొంత స్థలాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ శేఖర్ బాబు లబ్ధిదారులకు సూచించారు. బుధవారం మండలంలోని అగసనూరు, సాతనూరు, తుంబిగనూరు గ్రామాల్లో లబ్ధిదారులను కలిసి ఇంటి నిర్మాణాల పనితీరు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి అధికారులు, ఇంజినీర్లు పర్యవేక్షణ చేసి వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మండలంలో 2,987 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 16 జగనన్న కాలనీల్లో 1,229 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో నేరుగా లబ్ధిదారులకు 529 ఇళ్లు ప్రభుత్వమే కట్టించి ఇస్తుందని చెప్పారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని వారు ఈనెల 15వ తేదీ లోపు మొదలు పెట్టాలని లేకపోతే పట్టా రద్దు అవుతుందని స్పష్టం చేశారు.

ఆస్పరి ఏఓగా నరేంద్ర కుమార్

ఆస్పరి: ఆస్పరి ఏఓగా నరేంద్రకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న మునెమ్మ పత్తికొండకు బదిలీ కాగా ఆమె స్థానంలో హొళగుందలో పని చేస్తున్న నరేంద్ర కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.